
# ఆదర్శానికి అటూ ఇటూ...



— శుభ

త్రాళం తీసి యింట్లో నిస్త్రాణగా అడుగు పెట్టింది విజయ. పోస్టుమాన్ పడేసిన కవరు గుమ్మం వద్దనే కనిపించింది. ఎవరు రాసారో, ఏం రాసారో ఆమె ఊహించగలదు. మరింత నీరసంగా అనిపించింది. కవరు తీసుకుని వాలు కుర్చీలో వాలిపోయింది. తల నొప్పి. ఒళ్ళంతా పులపరం, కణతలు నొక్కుకుంటూ వుంటే వెచ్చగా కన్నీరు తగిలింది. తన మీద తనకే జాలి కలిగి దుఃఖం ముంచుకు వచ్చిందామెకు.

బాధ పంచుకోడానికి మరో ప్రాణి....భర్త.... ఉంటే ఎంత బాగుంటుంది! అనవసరంగా ఆదర్శాల ఊబిలో చిక్కుకుని - పెళ్ళి మాట తలపెట్టలేదు గాని ఈపాటికి యిద్దరు బిడ్డల తల్లి అయి ఉండేది తను. ఒక బాబు, ఒక పాప! పరవశంగా కాసేపు స్వీట్ హోం గురించి ఆలోచించింది.... తర్వాత - రాకూడని ఆలోచన వచ్చినట్లు ఉలిక్కిపడి, ఆ భావాన్ని బలంగా నెట్టేసి, స్నానం చేసి వచ్చింది.

మనసు తేలిక పడింది.

అద్దం ఎదుట నిలచి బొట్టు పెట్టుకుంటున్నప్పుడు ఆమె చేతులు అలాగే ఆగిపోయాయి. ప్రతిబింబాన్ని చూసుకుంటూ అలాగే వుండిపోయింది....చదువుకునే రోజుల్లో ఆమె కాలేజీ బ్యూటీ! కాంతులీనే కళ్ళు, దరహాస వదనం, చమత్కార భాషణం - ఆమె ఆకర్షణలు. ఆమె చుట్టూ సదా వందిమాగధులు, బాడీ గార్డులూ తిరిగేవారు. అసూయ చెంచే అమ్మాయిల్ని చూస్తే ఎంతో గర్వంగా అనిపించేది తనకు. అప్పుడామె వయసు - టీన్స్.

ఇప్పుడు ఆ కళ్ళలో కాంతి లేదు. దరహాసం స్థానంలో గంభీరత! అపార్థం చేసుకునే మగ మహారాజులకు భయపడి సరదాగా మాట్లాడం మానేసింది. ఇప్పుడామె వయసు ముప్పైరెండు. వృద్ధ కన్య!!

దీర్ఘంగా నిట్టూర్చి బొట్టు పెట్టుకుని వచ్చి వాలు కుర్చీలో వాలిపోయింది.

తలిదండ్రులతో తెగ తెంపులు చేసుకుని ఐదేళ్ళయింది. తను సాధించిందేమిటి? ఏమీ లేదు! తనకంటూ ఎవరూ లేరు! బ్రతుకు భారం అని

పిస్తోంది. ఎంతకాలం యిలా?....తప్పు చేసానా?! అని వేదన.

కాలేజీలో చదివే రోజుల్లో — వరకట్నాన్ని తీవ్రంగా దుయ్యబట్టి, కట్నం కోరేవాడిని పెళ్ళి చేసుకోం - అని ప్రతిజ్ఞ పట్టిన పాతికమంది అమ్మాయిల్లోనూ పెళ్ళి చేసుకోకుండా ఉండి పోయింది తను ఒక్కతె మాత్రమే. మిగిలిన వాళ్ళంతా పరిస్థితులతో రాజీపడిపోయి కట్నం యిచ్చి మరీ పెళ్ళి చేసుకున్నారు. అర్భకులు! అని వాళ్ళని ఆడిపోసుకుంది తను. రెండు మూడేళ్ళ వరకూ వాళ్ళనుండి ఉత్తరాలు వచ్చేవి. తర్వాత ఆగిపోయాయి. అమ్మా, నాన్నా మాత్రం ఉత్తరాలు రాస్తూనే వున్నారు - డబ్బు అవసరం అయినప్పుడల్లా! ఆ ఉత్తరాలన్నీ ఒకేలా వుంటాయి. రెండు పేజీలు తిట్లు! ఒక పేజీ కష్టాలు! చివరి పేజీలో డబ్బు కోసం దేబిరింపు!

మొదట్లో నెలనెలా మూడు నాలుగు వందలు పంపేది విజయ. అందుకు కృతజ్ఞత లేకపోగా రెండు పేజీల తిట్లు మాత్రం తప్పలేదు! ఎప్పటికైనా అమ్మా, నాన్నా తన ఆదర్శాన్ని అర్థం చేసుకుని ఆమోదించి ఆదరిస్తారన్న ఆశ అడియాస కాగా — 'మీ ఆలనా పాలనా చూడవలసిన బాధ్యత కొడుకులది; నాది కాదు — ఇంక డబ్బు పంపను' - అని నిష్కర్షగా రాసేసింది విజయ. అయినా మనసొప్పక అప్పుడప్పుడు ఒక వంద పంపుతూ వుంటుంది. ఇప్పుడు వాళ్ళకేం అవసరం ముంచుకు వచ్చిందో, మళ్ళీ ఉత్తరం రాసారు.

కవరు చించి, చదివింది.

"ఏమే విజ్జీ! నీ కిదేం పొయ్యేకాలమే? పరాయి మగాళ్ళతో వుంటున్నావట! పక్కింటి పావనమ్మ చెప్పింది. హాయిగా పెళ్ళి చేసుకుని లక్షణంగా కాపురం చేసుకోక నీకిదేం పెడ బుద్ధులే? నిన్ను కన్నందుకు మా కెంత తల వంపులుగా ఉందో తెలుసునా?...."

గుండెల్లో గూడు కట్టిన ఆ వేదన వెల్లువ కాగా వెక్కి వెక్కి ఏడుస్తూ మిగిలిన పేజీలు చదవకుండానే చించి పారేసింది విజయ

*

చాలామంది ఆఫీసర్లకు ఒక లక్షణం వుంటుంది- కంపెనీ బరువు బాధ్యతల్ని తను ఒక్కడే తన భుజస్కందాల మీద మోస్తున్నట్లూ, మిగిలిన వాళ్ళంతా పని దొంగలూ, సోమరులూ అయినట్లు భావించడం! అందర్నీ ఏడిపించడం!

అలాంటి శాడిస్ట్ ఆఫీసర్‌కి బదలీ అయింది. అందరూ సంతోషించారు. అయితే రాబోయే కొత్త ఆఫీసర్ కూడా చాలా స్ట్రిక్ట్ అని తెలిసింది. అందరూ మళ్ళీ వైరాగ్యంలో పడిపోయారు.

కొత్త యముడు ఆకర్షణీయంగానే వున్నాడు. ముప్పై అయిదేళ్ళుంటాయి. పేరు జయరాం. వస్తూనే మీటింగ్ పెట్టాడు. "మనమంతా ఒకే కుటుంబం కలిసి పనిచేద్దాం. కష్టాలు పంచుకుందాం, సుఖాలు పెంచుకుందాం" అని ఉపన్యాసం దంచేశాడు.

ఏ ఆఫీసర్ వచ్చినా అలానే అంటాడు. మాటల్లోని ఔదార్యం చేతల్లో కనిపించదు.

వారం రోజులు మామూలుగానే గడిచి పోయాయి.

కొత్తపెళ్ళికొడుకు కమల్ డ్రాఫ్టు గిలుకుతూనే ఆలోచిస్తున్నాడు. రెండు రోజులు సెలవు లొస్తున్నాయి, ముందు మరో రెండు రోజులు సెలవు తగిలించి అత్తవారింటికి వెళ్ళాలి. కొత్త యముడు సెలవు గ్రాంట్ చేస్తాడో లేదో. పాత రోజుల్లో మామ్మకు సీరియస్‌గా ఉందనో, బామ్మ చచ్చిపోయిందనో టెలిగ్రాం తెప్పించుకుని ఏడుస్తూ సెలవు సంపాదించేవాడు కమల్. ఒకసారి గుట్టు రట్టు అయింది కూడా. పాత యముడు నానా రభస చేసి ఇంక్రిమెంట్ ఆపేసాడు. కొత్త యముడి మీద కూడా టెలిగ్రాం మంత్రమే ప్రయోగించాలనుకున్నాడు కమల్.

అయితే ఫ్రెండ్‌కి ఉత్తరం రాసి టెలిగ్రాం తెప్పించుకోడానికి తగిన వ్యవధిలేదు. పాత టెలిగ్రాంనే - ఆఫీసర్ చేతిలో పడకుండా జాగ్రత్తగా ఉపయోగించాలి — ఐడియా భేషుగ్గా ఉందనుకున్నాడు కమల్.

విజయకు పిలుపు వచ్చింది. ఆమె గాభరాగా ఆఫీసర్‌గారి ఛాంబర్‌కి వెళ్ళింది. అక్కడ కమల్ దోషిలాగ తల వంచుకుని ఉన్నాడు. ఆఫీసర్ ముఖం గంభీరంగా వుంది. ఆయన చేతిలో టెలిగ్రాం వుంది.

"చూడండి మిస్ విజయా! కమల్‌గారి మామ్మగారు మళ్ళీ చనిపోయారట! ఆయనకు రెండు రోజులు సెలవు కావాలి. ఈ రెండు రోజులూ ఆయన పని మీరు చేయండి. మీరు సెలవు పెడితే మీ పని ఆయన చేస్తారు" అన్నాడు జయరాం గంభీరంగానే.

మామ్మగారు మళ్ళీ చనిపోయారు-అన్న మాటకు చచ్చేంత నవ్వు వచ్చింది గాని బలవంతంగా ఆపుకుని తలఊపింది విజయ.

వాళ్ళకి ఒక విషయం స్పష్టంగా అర్థం అయింది. "కొత్త యముడు సామాన్యుడు కాడు!"

*

ఒక నెల గడిచింది.

ఆఫీసులో సంచలనం బయలుదేరింది. ఆఫీసరు గారి పద్ధతి వాళ్ళకేం కొరుకుడు పడడం లేదు. జయరాం లేనప్పుడు అతని గురించే అందరూ వాదులాడేవి. మంచివాడని కొందరు; కాదని కొందరూ.

రాజా పక్కా తాగుబోతు. తాగవద్దని ప్రాధేయపడే భార్యని కొడుతూ ఉంటాడు. "కాణీ కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నాను. నోరెత్తకుండా పడివుండు. లేదా పుట్టింటికి పో" అని అరుస్తూ ఉంటాడు.

సరిగా అదేసమయంలో వాళ్ళింటికి వచ్చారు జయ్.

"భేష్. మగజాతి పరువు నిలిపావోయ్! నాకు చాలా గర్వంగా వుంది. నేమ్ బోర్డులో నీ డిగ్రీతో బాటు—కట్నం తీసుకోని ఊరికి ఉపకారి; పెళ్ళాన్ని చితగబాదే వీరుడు; దేవదాసుని మించిన మందుదాసు-అని రాయించుకుంటే మరీ భేషుగ్గా వుంటుందోయ్" అనేసి ఎంత హటాత్తుగా వచ్చాడో అంత హటాత్తుగానూ వెళ్ళిపోయాడు జయ్!

మరో రోజు - ఫ్రీలోలుడు మన్మధరావు మంచి రసపట్టులో ఉండగా రసాభాస అయింది. పేకాటరాయుడు పాయకరావుకీ అక్షితలు పడ్డాయి. ఇలా ఒక్కో రోజు ఒక్కొక్కరికి....

"సి. ఐ. డీ లాగ ఆయన మన యిళ్ళమీద దాడి జరపడం ఏమిటి?" అని తిట్టుకున్నారు కొందరు. గుట్టు రట్టు అయినందుకు సిగ్గు పడ్డారు మరికొందరు.

ఆ రోజు మీటింగ్....

"అందంగా కనిపించే స్కూటర్‌లో చిన్ననట్టు లూజు అయితేచాలు దాని నడక సుఖంగా వుండదు. ఏ నట్టు లూజు అయిందో తెలుసుకుని బిగిస్తేచాలు హాయిగా ప్రయాణం చేయవచ్చు...మన ఆఫీసులో అందరూ కష్టపడి పని చేస్తూనే వున్నారు. కాని

సజావుగా సాగడం లేదు డ్రాఫ్టుల్లో తప్పులు, ఫైళ్ళు కదలకపోవడం...లూజు నట్లులాగ బాధిస్తున్నాయి. పనిలో మనసు లగ్నం కాలేదంటే అందుకు ఏదో కారణం ఉంటుంది. ఆ కారణాలు తెలుసుకుని సాధ్యమైనంత సాయంచేయాలనే-మీరు పిలవక పోయినా-నేను మీ యిళ్ళకు వచ్చాను. చూసాను. అందుకు మీరు బాధపడనక్కర లేదు. మన మంతా ఒకే కుటుంబం. నేను మీ సోదరునిలాంటి వాడిని ...'' యిలా సాగింది జయ్ ఉపన్యాసం.

అందరూ ఆలోచనలో పడ్డారు. జయ్ స్వరం లోని ఆత్మీయత, నిజాయితీ వాళ్ళని ఆకర్షించాయి. పాత యమునికంటే ఈయన నయమే అని అనేక సందర్భాలలో రుజువు అయింది. ఆ ధైర్యం తోనే కొందరు తమ యిబ్బందులూ సమస్యలూ చెప్పారు.

ముఖ్య సమస్య ఒక్కటే. ఏదో ఒక మిషతో పాతయముడు ప్రతిఒక్కరి యింక్రిమెంట్ ఆపు చేసాడు. జీతాలు పెరుగుదల అమలుపరచ లేదు. లేనిపోని రిపోర్ట్లు పంపి ఉన్నతాధికారులకు ఈ బ్రాంచి మీద సదభిప్రాయం లేకుండా చేసాడు.

''ఒక్కొక్కరికి ఐదారు వేలు అరియర్స్ రావలసి ఉంది. ఆ డబ్బు యిప్పించండి. అంతా సజావుగా వుంటుంది. అదొక్కటే లూజ్ నట్'' అన్నారు అందరూ.

జయ్ ముఖం గంభీరంగా మారిపోయింది. హెడ్ ఆఫీస్‌లో ఈ బ్రాంచి పట్ల సదభిప్రాయం లేదు. అందుకే వీళ్ళ డబ్బు తొక్కిపెట్టారు. ఆ డబ్బు విడుదల చేయిస్తేగాని సమస్య పరిష్కారం కాదు. అందుకు ఉన్నతాధికారులు అంత సుల భంగా అంగీకరిస్తారా? ఆఫీస్ బాగుపడితే గాని డబ్బు శాంక్షన్ చేయం – అంటారు వాళ్ళు. బకాయిలు చెల్లిస్తేగాని ఆఫీసు బాగుపడదు అంటారు వీళ్ళు! వీళ్ళ లోపాలను ఎత్తిచూపి, సవరించాలని తన ప్రయత్నం. కాని వీళ్ళేమో ఆఫీసర్‌ల లోపాలు ఎత్తి చూపిస్తున్నారు!

ఒక్కసారిగా నీరసం ఆవహించింది జయ్‌కి. తెలియక ఊబిలో అడుగుపెట్టినట్లుంది. బయట పడడం ఎలా?

''బిల్స్ తయారుచేసి హెడ్ ఆఫీస్‌కి పంపిద్దాం. బకాయిలు శాంక్షన్ చేయించేందుకు శాయశక్తులా కృషి చేస్తాను'' అన్నాడు జయ్.

ఆ స్వరం నిండుగా లేదు!

రెండు వారాలపాటు జయ్ నిర్లిప్తంగా ఉండి పోయాడు వెనుకటి ఉత్సాహం లేదు. జోక్స్ లేవు. నవ్వులు లేవు.

''అబ్బాయిగారి బండారం బయటపడింది!'' అని నవ్వుకున్నారు అనుభవంతో తలపండిన వారు.

జయ్ నాలుగు రోజులు సెలవు పెట్టాడు.

ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాలు మొదలు!'' అను కున్నా రందరూ.

మూడో రోజునే వచ్చేశాడు జయ్. మరింత ఢీలా పడిపోయినట్లు కనిపించాడు. ''అబ్బాయి గారికి హెడ్ ఆఫీసులో మొండిచేయి ఎదురైంది కాబోలు'' అని గుసగుసలు వ్యాపించాయి.

సాయంకాలం మీటింగ్‌పెట్టి కేషియర్ సుబ్బా రావుని పిలిచాడు జయ్. ఆ స్వరంలో నీరసం?



ఒకప్పుడు !

''మీకెన్నేళ్ళు?'' అనడిగింది గొప్పలు చెప్పే గోవిందమ్మని పార్వతి.

''నిజం చెబుతున్నాను. నలభై ఏళ్ళు.... కానీ నేనలా కనిపించడం లేదు కదూ.''

''లేదు. కాని ఒకప్పుడు అలా కనిపించే వారు!''

టేబుల్ మీదున్న బ్రీఫ్‌కేస్‌లో ఏవో కాగితాలు గంభీరంగా వెదుకుతూ ఉండిపోయాడు జయ్.

ఉత్కంఠతో బిగుసుకుపోయి బొమ్మల్లా ఉండి పోయా రందరూ. చివరకు ఏదో కవరు తీసి సుబ్బారావు చేతిలో పెట్టాడు జయ్.

''ఏమిటిది?''

''చెక్కు!........ఐదు వేలకు చెక్కు!......మీ అరియర్స్!''

సుబ్బారావు ఆశ్చర్యం నుండి తేరుకోక ముందే బ్రీఫ్ లోంచి ఒక చెక్‌బుక్ తీసి యిచ్చాడు జయ్.

''మీ అందరి బకాయిలూ శాంక్షన్ అయాయి... కేషియర్ గారూ, ఈ చెక్స్ అందరికీ బట్వాడా చేయండి.''

వెనుకటి ఉత్సాహంతో ఖంగుమంది జయ్ స్వరం–తర్వాత ఘనకార్యం సాధించాను. మెచ్చు కోండి–అన్నట్లు అందరివైపూ చూసి చిన్నగా నవ్వాడు.

ఆ చిరునవ్వు-ఆ గదిలో-నవ్వుల పాతరను పేల్చింది! హర్షాతిరేకంతో కొందరు చప్పట్లు కొట్టగా, మిగిలిన వాళ్ళు చిన్న పిల్లల్లా గంతులు వేసారు!

వాళ్ళని కాసేపు ఆ ఆనందం అనుభవించనిచ్చి, ''లూజ్ నట్ బిగించడం అయింది. ఇకనుండి బండి నడక ఎలా ఉంటుందో గమనిస్తాను'' అన్నాడు జయ్.

*

క్రీగానిరాగం తీస్తూ, తాళం తీసి యింట్లో అడుగు పెట్టింది విజయ. గుమ్మంలోనే కవరు! పదవ కుండానే చిన్నముక్కలుగా చింపి చెత్తబుట్టలో పడేసింది.

ఆమె గుండె లోలోనే గానం చేస్తోంది - తియ్యగా మాటిమాటికీ ఎదలో జయ్ రూపమే మెదులుతోంది. ఆఫీసర్ అంటే అలా వుండాలి! అందరి సమస్యలూ సానుభూతితో వింటాడు. సాధ్యమైన సాయం చేస్తాడు. అందరి హక్కుల్నీ గౌరవిస్తూ, బాధ్యతల్ని మృదువుగా జ్ఞాపకం చేస్తూ ఉంటాడు.

ఇప్పుడు ఆఫీస్ వాతావరణం పూర్తిగా మారి పోయింది.

జయ్ అందరి యిళ్ళకూ వెళ్ళాడు. నేడో, రేపో మా యింటికీ వస్తాడు అని రోజూ అను కుంటూనే వుంది విజయ.

కాని అతడు యింతవరకూ రానేలేదు.

ఈ రోజు తప్పక వస్తాడు అని ఆమె మనసు చెబుతోంది!

గబగబా స్నానంచేసి వచ్చింది. బొట్టు పెట్టు కుంటూ ప్రతిబింబం చూసుకుంది. అక్కడక్కడ నెరసిన తల వెంట్రుకలు! ఆమె గుండె ఝల్లు మంది. ఆనందం అంతరించింది దిగులుగా ప్రతి బింబం చూసుకుంటూ అలానే వుండిపోయింది.

వీధి గదిలో ఎవరో వున్నట్లు అనుమానం కలిగి కంగారుగా కర్టెన్ తొలగించి చూసింది.

జయ్! వీక్లీ చదువుతూ కూర్చుని ఉన్నాడు!!

''ఎంతసేపయింది మీరు వచ్చి!!'' నమస్క రించి సంభ్రమంగా అడిగింది విజయ.

''చేయి వేయగానే తలుపు తెరుచుకుంది.

లోనికి వచ్చి పిలిచాను సమాధానం లేదు. కూర్చున్నాను" తాపీగా అన్నాడు.

"సారీ... బాత్‌రూంలో వున్నా."

"వండర్! ఐదు నిముషాల్లో స్నానం ముగించే ఆడవాళ్ళున్నారంటే అదో రికార్డ్!"

చాలా కాలానికి విజయ కిలకిలా నవ్వేసింది.

టిఫినూ, కాఫీ అయాక ఆదర్శాలు, ఆచరణలూ మీదకు ప్రసంగం మళ్ళించి, హరిశ్చంద్రునిపై అభిప్రాయం అడిగాడు జయ్.

రాగాలు మరిచిన మౌనవిపంచి ప్రసిద్ధవైణికుడు ఎదురుపడగా తనంతట తానే మోగినట్లు గలగలా మాట్లాడేసింది విజయ. "మనిషికి ఆదర్శాలూ, ఆచరణా అవసరమే. కాని హరిశ్చంద్రుని ఆదర్శంవల్ల అతని కీర్తి పెరిగిందిగాని ఏ పాపమూ! ఎరుగని భార్యాబిడ్డలు అష్టకష్టాలు పడ్డారు. ధర్మరాజు లౌక్యంగా అబద్ధం ఆడినట్టు హరిశ్చంద్రుడు కూడా చేయవలసింది! ఆదర్శాలు పిడివాదం కాకూడదు. కాస్త అటూ యిటూ – లేదా?" చిన్నగా నవ్వి సూటిగా అడిగాడు,

"ఏ ఆదర్శం?"

"కట్నం విషయం" అంటూ చివాలున కుర్చీలోంచి లేచి గుమ్మంవైపు రెండడుగులు వేసి వెనక్కి చూసి చిన్నగా నవ్వేసి గబగబా వెళ్ళిపోయాడు జయ్.

తన ఆదర్శంవల్ల తన బాధలేవో తను పడుతోందిగాని అందువల్ల యితరులకేమీ కష్టనష్టాలు లేవు కదా మరి అతడెందుకలా అన్నాడో ఆమె కర్థం కాలేదు. ఆలోచిస్తూ ఉండిపోయింది.

రెండు రోజులయాక జయ్ మళ్ళీ విజయ యింటికి వచ్చాడు. ఈసారి తన ఫ్రెండ్ రామారావు కథ చెప్పుకొచ్చాడు.

ఇంటికి పెద్దకొడుకై పుట్టడంకంటే అడవిలో మానై పుట్టడం మంచిది! పెళ్ళి చేసుకుని తలిదండ్రుల్ని వదిలేసి వేరే కాపురం పెట్టే పెద్దకొడుకు సుఖపడగలడేమో కాని కుటుంబ బాధ్యతల్ని నెత్తిన వేసుకునేవాడికి నరకయాతనే!

రామారావుకి నలుగురు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళు, వాళ్ళ చదువులూ, పెళ్ళిళ్ళూ, ఉద్యోగ ప్రయత్నాలలో భారీగానే ఖర్చు అయింది. తను పెళ్ళి చేసుకోకుండా ఆ అప్పులు తీర్చే ప్రయత్నంలో పడ్డాడు రామారావు. ఇప్పటికి అప్పు లయితే తీరాయిగాని ఇంకా ఒక చెల్లి పెళ్ళి మిగిలివుంది. తండ్రి రిటైర్ అయిపోయాడు.

రామారావు వద్ద పదివేలున్నాయి. మరో 30, 40 వేలుంటేగాని చెల్లి పెళ్ళికాదు. మళ్ళీ అప్పు చేస్తే తీర్చడానికి 4,5 సంవత్సరాలు పడుతుంది. అతడూ మనిషే. అతనికీ కోరికలున్నాయి, పెళ్ళి తలంపు ఉంది. కట్నం తీసుకోకూడదన్న ఆదర్శమూ వుంది. తలిదండ్రులు అతనితోనే వుంటారు. వాళ్ళెక్కడ వుంటే కూతుళ్ళూ, అల్లుళ్ళూ అక్కడికే వస్తారు. వాళ్ళకి మర్యాదలూ, పెట్టిపోతలూ, ఖర్చులు విపరీతం. రామారావు నలిగిపోతున్నాడు.

అతనికీ పెళ్ళిచేసుకోవాలని వుంది. ఎలాంటి భార్య వస్తుందోనని భయం!

"బాధ్యత అంతా మీకేనా? మీ తమ్ముళ్ళు కాస్త పంచుకోకూడదా? మీ తలిదండ్రులు యిక్కడే యింతకాలం తిష్టవేశారు. మిగిలిన కొడుకుల వద్దకు వెళ్ళి ఉండకూడదా? మీ చెల్లెళ్ళూ, బావలూ మన కొంపమీద పడిమేయడం యింకా ఎన్నాళ్ళు?" అని సతాయించే భార్య లభిస్తే వున్న కాస్త మనశ్శాంతీ హరించుకుపోతుంది.

సమస్యల్ని సహృదయతతో అర్థంచేసుకుని చేదోడువాదోడుగా వుండే భార్య దొరుకుతుందా? అప్పులూ, బాధ్యతలూ తీరాక, అంటే ఐదేళ్ళ తర్వాత పెళ్ళి చేసుకుంటే, అప్పటికి తన వయసు నలభై సమీపిస్తుంది. అంత లేటు వయస్సులో పెళ్ళంటే అనేక సమస్యలు! రిటైర్ లయేనాటికి పిల్లల చదువులే పూర్తికావు!

చెల్లితో బాటు తనూ వచ్చే వేసవిలో పెళ్ళి చేసుకోవాలని అతని కోరిక. అయితే 30,40 వేల అప్పులో గొంతువరకూ మునిగిపోయి, కొత్త సంసారసాగరంలో ఈదులాడడం అతనికిష్టంలేదు. తను కట్నం తీసుకుని ఆ డబ్బుతో చెల్లి పెళ్ళి చేయాలన్న ఆలోచన ఒకవైపు, కట్నం తీసుకోకూడదన్న ఆదర్శం మరోవైపు అతనిని మరింతగా కుంగదీస్తున్నాయి.

"సరియైన సలహాలిచ్చి చాలమంది సమస్యలు పరిష్కరించిన నేను నా ప్రాణ స్నేహితునకు సరియైన సలహా యివ్వలేకపోతున్నా. తలిదండ్రుల్ని తమ్ముళ్ళ వద్దకు తగిలివేయమని చెప్పనా? ముగ్గురు చెల్లెళ్ళ పెళ్ళి చేసావు కనుక చివరి చెల్లి పెళ్ళి బాధ్యత తమ్ముళ్ళ మీదకు నెట్టివేయమని చెప్పనా? అందరి బాధ్యతలూ నెత్తిన వేసుకుని పెళ్ళీ పెటాకులూ మానేసి కొవ్వొత్తిలాగ చివరవరకూ కరిగిపొమ్మని చెప్పనా? కట్నం తీసుకుని పెళ్ళి చేసుకోమని చెప్పనా? ఏం చెప్పను? మీరు ఏదైనా సలహా చెప్పగలరా?" అడిగాడు జయ్.

జయ్ తన సలహా అడుగుతున్నందుకు గర్వంగా అనిపించింది విజయకు, రామారావుపట్ల సానుభూతి కలిగింది. కాసేపు ఆలోచించి నెమ్మదిగా అంది. "ఉద్యోగం చేసుకునే పిల్లను పెళ్ళిచేసుకుంటే ఆమె జీతంతో అప్పు తొందరగా తీర్చవచ్చుకదా."

చిన్నగా నవ్వేశాడు జయ్. "అదీ ఒకవిధంగా కట్నమే....వాయిదాల పద్ధతి కట్నం! నాకు మరో పరిష్కారం తడుతోంది. అమ్మాయి రామారావుకి డబ్బు యిస్తుంది. కట్నంగా కాదు; అప్పుగా! పెళ్ళి అయాక ఐదేళ్ళలో భార్యకి అప్పు తీర్చేస్తాడు రామారావు!"

కిలకిలా నవ్వేసింది విజయ్. "పరాయి వాళ్ళయితే ముక్కు గుద్ది అప్పు వసూలు చేసుకోగలరు. కాని భార్యకదా! గట్టిగా అడగలేదు, అప్పు ఎగవేసినా! అమ్మా, అదా మీ ఎత్తు!" గలగలా అనేసింది.

జయ్ నవ్వలేదు. అతని ముఖం గంభీరంగా మారిపోయింది. "రామారావు మాటకు కట్టుబడే మనిషి! ఎగవేసే సమస్యలేదు. అందుకు నేను హామీ ఉంటాను. కట్నం ఒక దురాచారమే, కాదనను. కట్నంకోరే వాడిని పెళ్ళిచేసుకోకూడదని అమ్మాయిలు ప్రతిజ్ఞ చేయడం సమంజసమే. కాని అబ్బాయిలకు ఒక సమస్య ఎదురవుతోంది. బాదర బందీలు లేని అబ్బాయి కట్నం కోరడం అన్యాయమే. అయితే రామారావు లాంటి వారికి పరిష్కారం ఏమిటి?" అతని స్వరంలో కాస్త తీవ్రత.

అనాలోచితంగా జయ్‌ని బాధించినందుకు చింతించింది విజయ్. "సారీ! జోక్‌గా అన్నాను కాని మీ ఫ్రెండ్ అప్పు తీర్చరనికాదు నా ఉద్దేశ్యం. నిజానికి మీరు సూచించినదే సరియైన పరిష్కారం" అంది.

"మీ సర్వీస్ ఐదేళ్ళు... కనుక మీవద్ద కనీసం ముప్ఫైవేలు ఉంటాయని నా అంచనా....మా రామారావుని పెళ్ళిచేసుకోవడం మీకిష్టమేనా?" సూటిగా అడిగాడు జయ్.

నిర్ఘాంతపోయింది. ఉక్కిరి బిక్కిరి అయింది. అనూహ్యమైన ప్రశ్న! ఊహాతీతంగా తాకింది.

"వాడిపోయి, నేలకు ఒరిగిపోయిన మొక్కల్ని ఏదో విధంగా నిలబెడితే_అవి పుష్పిస్తాయి. ఎండిపోయాక అవి పుష్పించలేవు కదా. ఏవో ఆదర్శాలను నమ్ముకుని మీరూ, వాడూ, వాడిపోయిన మొక్కల్లా తయారైనారు. ఎండిపోక ముందే మేలుకోకపోతే మీ జీవితాలు మోడులవుతాయి. తర్వాత విచారించి లాభం లేదు.... ఆదర్శాలకు కూడా పట్టు విడుపులుండాలి. ధర్మరాజు లాగ లౌక్యం ప్రదర్శించాలి! బాగా ఆలోచించండి. వారం రోజులు పోయాక వస్తాను. మీ అభిప్రాయం చెబితే వాడిని రప్పిస్తాను. మీకు మన స్ఫూర్తిగా నచ్చితేనే వివాహ ప్రసక్తి..."

విజయ కిదంతా అయోమయంగా వుంది. దిగ్భ్రమగా వుంది. నోరు తెరుచుకుని వింటూ వుండిపోయింది. ఆమె తేరుకునేసరికి అతడు వెళ్ళిపోయాడు.

తీవ్ర సంక్షోభంలో పడిపోయింది విజయ.

తనకింక వివాహం కాదన్న నగ్నసత్యానికి అలవాటుపడుతూ వున్న క్షణంలో సువర్ణావకాశం లభించింది. అప్పు అని మభ్యపెట్టినా నిజానికి తను యివ్వవలసినది కట్నమే! పెళ్ళికోసం ఆదర్శాన్ని ఒదులుకోవడమా? ఆదర్శం కోసం పెళ్ళి మానుకోవడమా? హరిశ్చంద్రుడా, ధర్మరాజా_ఎవరి మార్గం అనుసరించాలి? ఒకప్పుడు ధర్మరాజుని సమర్ధించిన ఆమెకు యిప్పుడు ఎటూ పాలుపోవడం లేదు.

రాత్రంతా ఆమె ఆలోచిస్తూనే వుంది ఉదయం స్నానంచేసి బొట్టుపెట్టుకుంటూ అద్దంలో-నెరసిన తలవెంట్రుకలు చూసుకున్నప్పుడు ఆమెలో ఏదో నిర్ణయం తళుక్కుమంది!

*


ప్రత్యేక శ్రద్ధతో అరగంట సేపు అలంకరించుకుని అద్దం ముందు నిలుచుంది విజయ. ప్రతిబింబం కొత్త కనిపించింది.

పెళ్ళి చూపులు! తనకు పెళ్ళి చూపులు!! ఈ వయస్సులో ఈ విధంగా! అమ్మలక్కలు లేరు! పెద్దలు లేరు! వేళాకోళాలూ వేడుకలూ అసలే లేవు! వింత పెళ్ళి చూపులు!

వీధి గదినుండి బెడ్‌రూంకి, అక్కడనుండి వీధి గదిలోకి పదిసార్లైనా తిరిగింది. తన కంగారు గానీ, యింకా పావుగంటగ్గాని వాళ్ళు రారు. ఆ గదిని మరోసారి పరిశీలించింది.

ఎక్కడా దుమ్మూ, బూజు లేదు. గోడలకు గీసిన పెయింటింగ్స్ వేలాడుతున్నాయి. మూడు కుర్చీలు గుండ్రంగా మధ్య టీపాయ్ ప్రక్కగా టేబుల్ మీద నీటుగా సర్దిన నవలలు ఒక ప్రక్క ఫోటోఫ్రేములో తన ఫోటో. మరోప్రక్క టేప్ రికార్డర్.

గదినిండా అగరుపరిమళం.



## మోసేవాళ్ళం!?

బాగా డబ్బున్న ఒహాయనకు ఓసారి బాగా జబ్బు చేసి, ఇహ పోతాడని అందరూ ఆశ వదులుకోగా, శుభ్రంగా కోలుకుని ఆస్పత్రి గది విడిచి స్వయంగా నడుస్తూ బయటకు వచ్చాడు. గది బయట జనం బారులు తీరి నిలబడి వున్నారు. వారందరూ చేతులు ముందుకు చాపి ఆశగా తన వైపు చూడటం గమనించి ఆశ్చర్య పోయాడా ధనికుడు. వారిలో కొందరు తనకు సేవ చేసిన వారని గుర్తించి వాళ్లందరికి 'టిప్'లు ఇస్తూ వచ్చాడు. చివరికి తన గది కిటికీలు తుడిచిన వాడు కూడా 'టిప్' కోసం ఎగబడేసరికి ఆయనలో ఓపిక నశించింది. ఎలాగో వాళ్ళందర్నీ వదిలించుకుని బయటకు వచ్చేసరికి ఓ నలుగురు వ్యక్తులు ఆయన వెంట పడ్డారు.

"మీరు నాకేం చేశారు?" అన్నాడు విసిగిపోయిన ఆ పెద్ద మనిషి.

"అయ్యా....మీరు మరణిస్తే మిమ్మల్ని మోసేందుకు నియమింపబడ్డవాళ్ళం...."

స్కూటర్ శబ్దం వినిపించగా గాభరాగా కిటికీలోంచి చూసింది. జయ్ ఒక్కడే స్కూటర్ స్టాండ్ వేస్తున్నాడు. "అతడు" రాలేదా? తీవ్ర ఆశాభంగం. స్థాణువులా వుండిపోయింది.

జయ్ లోనికి వచ్చి ఆమెనే చూస్తూ వుండిపోయాడు. తను రోజూ చూసే విజయయేనా ఈమె?! ఈమెలో యింత అందం, యింత ఆకర్షణ ఉన్నాయా?! అని కాబోలు ఆ చూపులకర్థం!

"ఆయన.... ఆయన... రాలేదా?" తల వంచుకుని నెమ్మదిగా అడిగింది.

"వచ్చాడు! కాని మీకు నచ్చుతానో, లేదోనని సంశయిస్తున్నాడు!" జయ్ స్వరం తమాషాగా వినిపించి, చివాలున తల ఎత్తి అతనివైపు

"నేను నీకు నచ్చానా విజయా!" చిన్నగా నవ్వుతూ అడిగాడు,

అతడు అంటున్నదేమిటో ఆమెకు మొదట అర్థంకాలేదు. అలాగే వుండిపోయింది. తర్వాత ఆమె తలలో మెరుపు మెరిసింది!

జయ్ పూర్తి పేరు జయరామారావు!

"చెప్పండి మాడమ్! నచ్చానా?" ఎయిర్ యిండియా మహారాజులాగ వినయంగా ఒంగిపోతూ అడిగాడు జయ్.

ఆమెకు కన్నీళ్ళు చివ్వున ఎగిసి వచ్చాయి. ఆ కళ్ళలో వెలుగు వెన్నెల! జలజల కురుస్తున్న మేఘమాలను తప్పించుకుని ఫక్కున నవ్విన సూర్యబింబంలా మెరిసిపోతోంది ఆమె ముఖం.

"చూడవచ్చిన వాడిని! టిఫిన్ అయినా పెట్టకుండా పొమ్మనేట్టు వున్నారే!" అన్నాడు జయ్ వేళాకోళంగా.

"కూచోండి సార్" అంటూ లోనికి పరిగెత్తి టిఫిన్ తెచ్చి టీపాయ్‌మీద పెట్టి ఎదురుగా కూచుంది విజయ.

ఈలోగా టేప్ రికార్డర్ బటన్ నొక్కాడు జయ్. ఏదో పాట సన్నగా వినిపిస్తోంది.

"తలిదండ్రుల్ని నొప్పించలేక, బాధ్యతల్ని తప్పించుకోలేక నాలాంటి వాళ్ళు - కట్నం తీసుకోమని ప్రమాణం చేసినా - అందుకు కట్టుబడి ఉండలేరు. అందుకు పరిహారంగా - తీసుకున్న కట్నం అప్పుగా భావించి తిరిగి తీర్చేస్తామనీ, పుట్టబోయే కొడుకులకు కట్నం తీసుకోమనీ ప్రమాణం చేస్తే- అది ఆచరణ సాధ్యంగా కూడా వుంటుంది. నావంతు ప్రమాణం నేనిప్పుడే చేస్తున్నా." అన్నాడు జయ్ కళ్ళు మూసుకుని, చేయి ముందుకు చాపి.

ఆ చేయికి తన చేయి కలిపింది విజయ.

టేప్‌రికార్డర్ పాట యిప్పుడు స్పష్టంగా వినిపిస్తోంది.

వాడినపూలే వికసించెనే.... □